

శింగనమల చెరువు నిండితే రాకపోకలు ఉండవు

బడి మానేసి.. ఇంటివద్దే పల్లెటూరి విద్యార్థులు

2022లో నాలుగు నెలలపాటు ప్రజలకు కష్టాలు

బ్రిడ్జి నిర్మాణానికి నాటి ఎమ్మెల్యే ఉత్తుత్తి హామీలు

కూటమి ప్రభుత్వంలో కష్టాలు తీరేనా..?

మరువ కష్టాలు



శింగనమల చెరువు నిండి ప్రవహిస్తున్న మరువ (ఫైల్)

వర్షం వస్తే బడికి వెళ్లలేం..



నేను 8వ తరగతిలో వంక పారడంతో నెల రోజులు బడికి పోలేదు. ఆ తరువాత భయపడుతూనే నీటిని దాటుకుని రెండు నెలలు వెళ్లాం. వర్షం వస్తే మాకు భయం వేస్తుంది. వంక పారితే బడి మానేయాల్సిందే. బ్రిడ్జి నిర్మిస్తామని అంటున్నారు. కానీ ఎప్పుడో తెలియడం లేదు.

- యశ్వంత్, పోతురాజు కాల్వ

మా నాన్న వచ్చేవాడు..



వర్షాకాలం వస్తే బడికి వెళ్లడం కష్టంగా ఉంటుంది. వంకకు నీరు వచ్చినప్పుడు బడి మానేయాల్సిందే. 2022లో మూడు నెలలపాటు ఇబ్బంది పడ్డాం. నెల రోజులు ఇంటివద్దే ఉన్నాను. ఆ తరువాత మా నాన్న రోజూ బడి వద్దకు వచ్చి వదిలేవాడు. బ్రిడ్జి మంజూరైందని అంటున్నారు. త్వరగా నిర్మిస్తే సమస్య ఉండదు.

- నాగసుధ, పోతురాజు కాల్వ

నాలుగు నెలలు బంద్

శింగనమల చెరువు నిండి.. 2022 ఆగస్టు నుంచి డిసెంబరు వరకూ ఐదు నెలలు పాటు మరువ పారింది. దీంతో నియోజకవర్గంలోని సుమారు 50 గ్రామాల ప్రజలు నెలల తరబడి అనంతపురం, తాడిపత్రికి రాకపోకలు సాగించలేకపోయారు. తప్పనిసరి పరిస్థితుల్లో 10 నుంచి 15 కి.మీ. అదనంగా ప్రయాణం చేశారు. మరువ ఉధృతికి రోడ్డు ధ్వంసమైంది. చెరువు నుంచి బయటికి వెళ్లిన నీరు మరువ వంకకు వెళుతుంది. వంక ఉధృతి కారణంగా రోడ్డు కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోతురాజుకాల్వ గ్రామానికి చెందిన 40 మంది విద్యార్థులు సోదనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. రోడ్డు కోతకు గురికావడం, వంక దాటడం ప్రమాదకరం కావడంతో నెల రోజులు బడికి వెళ్లలేదు. ఆ సమయంలో వంక వద్ద బ్రిడ్జి నిర్మిస్తామని అప్పటి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కానీ నాలుగు పైపులు, రోడ్డుపై మట్టి వేసి చేతులు దులుపుకున్నారు. ఆ తరువాత బ్రిడ్జి నిర్మాణం గురించి పట్టించుకోలేదు.

శింగనమలలోని శ్రీరంగరాయల చెరువు నిండి మరువ పారితే ఉధృతి తగ్గేవరకూ 40 నుంచి 50 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఈ సమస్య పరిష్కారానికి మరువ వద్ద బ్రిడ్జి నిర్మించాలన్న ప్రతిపాదన కొన్నేళ్ల నుంచి ఉంది. బ్రిడ్జి నిర్మిస్తామని వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త, అప్పటి ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హామీ ఇచ్చారు. కానీ నిలబెట్టుకోలేదు. దీంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు నెలల తరబడి పాఠశాలలకు వెళ్లలేక పోతున్నారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం తాడిపత్రి, అనంతపురం నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. మరువ పారిందంటే వీరికి ప్రయాణాలు కష్టతరమౌతాయి. అనంతపురానికి రావాలంటే గార్లదిన్నె మీదుగా, తాడిపత్రికి వెళ్లాలంటే కొరివిపల్లి, పెద్దపప్పూరు మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. సోదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పదుల సంఖ్యలో విద్యార్థులు చదువుకుంటున్నారు. మరువ పారితే వీరు బడికి వెళ్లడం మానేయాల్సిందే. -శింగనమల



చెరువు మరువ వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేయవలసిన ప్రాంతం

రూ.4 లక్షలతో సరిపెట్టారు

శింగనమల మరువ వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.4 కోట్లతో ఆర్ అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పెట్టారు. ఆ మొత్తం ఎక్కువ అని భావించి, రూ.2.90 కోట్లతో ఒకసారి, రూ.2.40 కోట్లతో మరోసారి అప్పటి ఎమ్మెల్యే ద్వారా ప్రతిపాదనలు పంపారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆర్అండ్‌బీ ద్వారా రూ.4 లక్షలు ఇచ్చారు. ఆ సొమ్ముతో మరువ వద్ద ధ్వంసమైన రోడ్డుకు 50 మీటర్లు ప్యాచ్ వర్క్ చేశారు. పోతురాజుకాల్వ-సోదనపల్లి వంకపై బ్రిడ్జి నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.6.30 కోట్లు మంజూరయ్యాయి. కానీ పనులను చేపట్టలేదు.

తాజాగా ప్రతిపాదనలు..

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవతో శింగనమల చెరువు మరువ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.6 కోట్లతో ఆర్ అండ్ బీ అధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. శింగనమల మరవకొమ్మ నుంచి గార్లదిన్నె వరకూ డబుల్ లైను రోడ్డు నిర్మాణానికి మరో రూ.60 కోట్లతో ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు, ఆ శాఖ మంత్రికి ఎమ్మెల్యే విన్నవించారు.

15 కి.మీ. అదనపు ప్రయాణం..

2022లో చెరువు నిండి మరువ పారింది. మూడు నెలలపాటు అనంతపురానికి వెళ్లేందుకు వీలు లేకపోయింది. నేను శింగనమలలో కాయగూరల వ్యాపారం చేస్తాను. అప్పుడు అనంతపురానికి వెళ్లేందుకు రోజూ 15 కి.మీ. అదనంగా ప్రయాణించాల్సి వచ్చింది. ఖర్చు ఎక్కువ వచ్చింది. వైసీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం చేపడుతుందని అప్పట్లో అన్నారు. కానీ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



- కాంతగారి సత్యనారాయణ



మరువ ప్రవహించడంతో ధ్వంసమైన రోడ్డు

రూ.6 కోట్లతో ప్రతిపాదన..

శింగనమల మరువ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.6 కోట్లతో ప్రతిపాదన పంపాము. శింగనమల నుంచి గార్లదిన్నెకు డబుల్ లైన్ రోడ్డుకు రూ.60.30 కోట్లతో పై అధికారులకు నివేదికను పంపాము. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తాం.

- నరసింహమూర్తి, ఆర్అండ్‌బీ జేఈ



పోతురాజుకాల్వ-సోదనపల్లి వంక వద్ద పైపులు, మట్టితో తాత్కాలిక రోడ్డు

ఎమ్మెల్యే స్పందించాలి..

వైసీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం గురించి గాలి మాటలు చెప్పింది. వర్షాలు వచ్చి మరువ పారితే మళ్లీ రాకపోకలు నిలిచిపోతాయి. 2022లో నాలుగు నెలలు ఇబ్బందులు పడ్డాం. ఎమ్మెల్యే బండారు శ్రావణి బ్రిడ్జి నిర్మాణానికి చొరవ చూపాలి.



- నాగలాపురం విజయ్

గంజాయి గ్యాంగ్‌ను పట్టుకున్న పోలీసులు

జైలుకు పంపిన జల్సాలు

నలుగురి అరెస్టు.. ఒకరు పరారీ

తొమ్మిది కిలోల గంజాయి స్వాధీనం

కారు, రెండు ద్విచక్ర వాహనాలు సీజ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్ రెడ్డి

పామిడి, ఆగస్టు 7: పద్ధతిగా సేద్యం చేసుకుంటూ, పాలు అమ్ముకుంటూ బతికేవారు. జల్సాలకు ఆ సొమ్ము సరిపోలేదని మొదట కర్ణాటక మద్యం అమ్మారు. ఆ తరువా గంజాయి వ్యాపారంలోకి దిగారు. పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు. పామిడి పోలీసు స్టేషన్‌లో సీఐ రాజశేఖర్‌రెడ్డి ఈ వివరాలను బుధవారం వెల్లడించారు. పామిడి మండలంలోని పాళ్యం గ్రామానికి చెందిన అన్నదమ్ములు తమ్మినేని శివకుమార్, తమ్మినేని నందకుమార్ పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవారు. ఆవులను పెంచుతూ పాలను అమ్మేవారు. వీటి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు, జల్సాలకు సరిపోలేదని అడ్డదారిలో వెళ్లారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తెచ్చి పాళ్యంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో అమ్మేవారు. ఈ క్రమంలో విడపనకల్లు పోలీసు స్టేషన్‌లో ఒక కేసు, పామిడి పోలీసు స్టేషన్‌లో ఒక కేసు నమోదయ్యాయి. పోలీసులకు దొరికినా వారిలో మార్పు రాలేదు. గంజాయి విక్రయిస్తే మరింత ఎక్కువ సంపాదించవచ్చునని భావించారు. మూడు నెలల నుంచి తమ చిన్నాన్న కొడుకు గోపాలకృష్ణ, అనంతపురం నగరంలోని నందమూరి నగర్‌కు చెందిన పిన్నమ్మ కొడుకు పత్తిపాటి రవితేజ, పెద్దవడుగూరు మండలం లక్ష్ముంపల్లి గ్రామానికి చెందిన అమర్‌నాథ్‌తో కలిసి గంజాయి వ్యాపారం ప్రారంభించారు. గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయిని కొని.. అనంతపురం, గుంతకల్లులో అమ్మేవారు. జూలై 24న కారులో విశాఖపట్నం వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల వద్ద 9210 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశారు. ఈ నెల 3న పాళ్యం గ్రామానికి చేరుకున్నారు. గంజాయి సంచిని శివకుమార్ ఇంటి సమీపంలోని కల్లందొడ్డి దిబ్బలో దాచారు. దాన్ని విక్రయించేందుకు కారులో తీసుకుని బుధవారం పామిడికి వచ్చారు. నీలూరు క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారి పక్కన కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తుండగా డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ రెడ్డి, మండల వ్యవసాయాధికారి లీనావసుంధర పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేశారు. తమ్మినేని శివకుమార్, ములకల గోపాలకృష్ణ, పత్తిపాటి రవితేజ, అమర్‌నాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. తమ్మినేని నందకుమార్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి తొమ్మిది కిలోల గంజాయి, ఒక కారు, రెండు బైకులు, ఐదు సెల్‌ఫోన్‌లు, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

కమ్మూరు గ్రామ రస్తా ఆక్రమణ

బరితెగింపు!




కమ్మూరు గ్రామానికి వెళ్లే దారిలో వెలసిన వెంచర్

వెంచర్ వేసిన రియల్టర్లు

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

కూడేరు, ఆగస్టు 7: వైసీపీ పాలనలో రియల్టర్లు బరి తెగించి, ప్రభుత్వ భూములే కాదు.. రస్తాలను కూడా ఆక్రమించారు. అడ్డుకునేవారు లేకపోవడంతో రస్తాలను సైతం ఆక్రమించి వెంచర్లు వేసేశారు. దీనికి రెవెన్యూ అధికారులు కూడా వంతపాడితే ఎలా ఉంటుందో ఈ వెంచర్‌ను చూస్తే అర్థమవుతుంది. అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న భూములు కోట్లు విలువ చేస్తున్నాయి. రైతుల నుంచి భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తున్నారు. కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి వెళ్లేందుకు ఎన్నో ఏళ్ల నుంచి ప్రధాన రహదారి నుంచి రస్తా ఉందని స్థానికులు తెలిపారు. ఈ విషయం రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఉంది. భూమిని కొనుగోలు చేసిన రియల్టర్లు దాన్ని కనుమరుగు చేశారని పలువురు ఆరోపించారు. రస్తాను కబ్జా చేసి వెంచర్ వెసినా రెవెన్యూ అధికారులు పట్టించు కోలేదు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దారు విశ్వనాథ్‌ను అడగ్గా తమ సిబ్బందిని పంపి పరిశీలిస్తామన్నారు.

చర్యలు తీసుకోండి



అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారికి ఆనుకొని వేసిన వెంచర్‌లో కమ్మూరు గ్రామానికి వెళ్లే రస్తాను ఆక్రమించారు. తక్షణం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. కూడేరు మండలంలో ప్రభుత్వ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేసి, సొమ్ము చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తక్షణం ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న వెంచర్లపై కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేయాలని, రస్తాను ఆక్రమించుకుని వెంచర్ వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని

పకడ్బందీగా అమలు చేస్తాం

మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

అనంతపురం టౌన్, ఆగస్టు 7: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ మురళీ క్రిష్ణ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కేసుల పురోగతిపై చర్చించారు. అధికారులు తమకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, ఇలా అయితే కేసుల పరిస్థితి ఏమిటో తమకు ఎలా తెలుస్తుందని సభ్యులు ప్రశ్నించారు. సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కేసుల నమోదు విషయంలో స్టేషన్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజూ సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల వరకు విజిటర్స్ అవర్ నిర్వహించాలని పోలీసు శాఖకు సూచించారు. స్టేషన్‌కు వచ్చేవారిపట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. సభ్యులను గౌరవించేలా చూస్తామని అన్నారు.

చిన్నచూపు వద్దు: ఎమ్మెల్యే శ్రావణి

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను చాలా ప్రాంతాలలో చిన్న చూపు చూస్తున్నారని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన వర్గాలపై దాడులు, భూ కబ్జాల కేసులపై సరిగా స్పందించడంలేదని అన్నారు. శింగనమల నియోజకవర్గంలో 72 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ, కలెక్టర్‌ను కోరారు. శింగనమల మండలం రాచపల్లి వద్ద 2010లో ఏర్పాటైన లెదర్ ఫ్యాక్టరీకి ఇప్పటి వరకూ ప్రహరీ, రహదారి లేవని అన్నారు. పుట్లూరు మండలంలో ఎస్సీ హాస్టల్‌కు ప్రహరీ, విద్యుత్, రహదారి సౌకర్యాలు లేవని అన్నారు. కమిటీ సభ్యులు తమ ప్రాంత సమస్యలు, శ్మశాన వాటికల గురించి కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. డీఆర్వో రామక్రిష్ణారెడ్డి, ఆర్డీఓలు వసంతబాబు, రాణిసుష్మిత, శ్రీనివాసులురెడ్డి, సభ్యులు యల్లన్న, దాస్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

రూ.6.50 కోట్లు దోచిన తోపుదుర్తి బ్యాచ్

నసనకోట గ్రామస్థుల మండిపాటు

రామగిరి, ఆగస్టు 7: నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో గడిచిన ఐదేళ్లలో రూ.6.50 కోట్ల దోపిడీ జరిగిందని నసనకోట పంచాయతీ ప్రజలు ఆరోపించారు. ఆలయ ఆవరణలోని గదులు, వ్యాపార అనుమతులకు బుధవారం నిర్వహించిన వేలంపాటలో రూ.89.65 లక్షల ఆదాయం వచ్చిందని, దీని ప్రకారం లెక్కవేస్తే దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో అర్థమౌతుందని అన్నారు. దోపిడీ వెనుక అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి బ్యాచ్ ఉందని ఆరోపించారు. ఆలయ కమిటీ మాజీ సభ్యులు రామ్మూర్తినాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, దేవదాయశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్, పోలీసు అధికారులు, గ్రామస్థుల సమక్షంలో వేలంపాట నిర్వహించారు. హుండీ, దుకాణాల వేలం నిర్వహించాల్సి ఉంది. అందులో కూడా రూ.60 లక్షలదాకా ఆదాయం వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఐదేళ్లలో రూ.కోటి ఆదాయం సమకూరినట్లు ప్రకాశ్ రెడ్డి బ్యాచ్ చూపించిందని, మిగిలిన సొమ్మును మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్‌గా ఉన్న కురుబ ముత్యాలు, బీసీ ముత్యాలు ఆలయ ఈఓ, పూజారులు దోచుకున్నారని ఆరోపించారు. గత ఐదేళ్లలో ఆదాయ వ్యయాల వివరాలను బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వేలంపాట నిర్వహిస్తున్న ముత్యాలమ్మ ఆలయ కమిటీ

రాయదుర్గం-బళ్లారి మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, ఆగస్టు 7: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాయదుర్గం మీదుగా విజయపుర-బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు నైరుతి రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయపుర-బెంగళూరు ప్రత్యేక సింగిల్ ట్రిప్ రైలు (06235) ఈ నెల 18వ తేదీ రాత్రి 7 గంటలకు విజయపురలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11-15 గంటలకు బెంగళూరుకు చేరుతుందన్నారు.

బెంగళూరు-విజయపుర ప్రత్యేక రైలు(06231) బెంగళూరులో ఈ నెల 14న రాత్రి 9 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 2-05 గంటలకు విజయపురకు చేరుకుంటుందని తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06232) ఈ నెల 15వ తేదీ రాత్రి 7 గంటలకు విజయపురలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11-15 గంటలకు బెంగళూరుకు చేరుతుందని పేర్కొన్నారు. ఈ రైళ్లు చిక్‌బనవర్, తుమకూరు, అరిసికెరె, బీరూర్, చిక్జాజూర్, చిత్రదుర్గ, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంటు, తోరణగల్లు, హోసపేట, కొప్పల్, గదగ్, బాదామి, బాగల్‌కోట్, ఆల్మట్టి స్టేషన్ల మీదుగా వెళతాయని తెలిపారు.

శ్రీనివాస కల్యాణం

పులకించిన భక్తజనం



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి



వేడుకలకు హాజరైన భక్తజనం

అనంతపురం నగరంలోని పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం కన్నుల పండువగా సాగింది. వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అష్టోత్తర కలశాభిషేకం, తోమాల సేవ నిర్వహించారు. అనంతరం అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ సేవ నిర్వహించారు. తదనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివార్ల కల్యాణోత్సవం జరిపించారు. గోవింద నామస్మరణలతో భక్తులు పులకించిపోయారు. సాయంత్రం డోలోత్సవం, సహస్రదీపార్చనతో వేడుకను ముగించారు. పాతూరు ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు, వాసవీ మహిళామండలి అధ్యక్షురాలు చల్లా స్వర్ణలత, సభ్యులు పాల్గొన్నారు. -అనంతపురం కల్చరల్



స్వామికి పూలహారం..



గోవిందుడిని బంధిస్తూ..



గోవిందుడి వేషధారణలో చిన్నారి

నేడు బడి ఎన్నికలు

జిల్లాలో 1741 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎలక్షన్స్

ఓటు వేయనున్న 2,01,108 మంది విద్యార్థుల తల్లిదండ్రులు

ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

సజావుగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధం

అనంతపురం విద్య, ఆగస్టు 7: జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఎన్నికలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1741 స్కూళ్లలో ఎన్నికలు నిర్వహించనున్నారు. గతంలో వైసీపీ నాయకుల దాడులు, దౌర్జన్యాలకు దిగడంతో కొన్ని చోట్ల సమస్యాత్మకంగా, వివాదాలకు కేంద్రంగా మారాయి. అయితే ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు 2.01 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారి తల్లిదండ్రులు ఓటర్లుగా ఓటును వినియోగించుకోనున్నారు.



యాడికిలో గతంలో పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

కల నిర్వహణకు ఆదేశాలు జారీ చేసింది.

ఎస్‌ఎంసీ కీలకం

స్కూళ్లలో ఎస్‌ఎంసీలు కీలక పాత్ర పోషిస్తాయి. స్కూల్‌లోని తరగతుల నిర్వహణ, నిధుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు తీరును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. స్కూల్‌లోని విద్యార్థుల తల్లి లేదా తండ్రికి ఓటు హక్కు ఉంటుంది. ఎన్నికల్లో పాఠశాలలోని ప్రతి తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులు ను లేదా సంరక్షకులను సభ్యులుగా ఎన్నుకుంటారు. ఎన్నికైన సభ్యుల్లోంచి ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, ఎక్స్ అఫిషియో సభ్యులు, కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ కమిటీ రెండేళ్లపాటు కొనసాగుతుంది. జిల్లాలో జడ్పీ, ఎంపీపీ స్కూళ్లు 1481, మున్సిపల్ స్కూళ్లు 152, కేజీబీవీలు 32, ఎయిడెడ్ స్కూళ్లు 23, స్టేట్ గవర్నమెంట్ స్కూళ్లు 16, మోడల్ స్కూళ్లు 15, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు 11, ట్రైబల్‌వెల్ఫేర్ స్కూళ్లు 6, ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు 4, బీసీ వెల్ఫేర్ స్కూల్ 1, రైల్వే స్కూల్ 1 ఉన్నాయి. వీటి పరిధిలోని ఎస్‌ఎంసీలకు గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు.

గతంలో రాద్ధాంతం...

గతంలో ఎస్‌ఎంసీ ఎన్నికల సందర్భంగా స్కూళ్లలో వైసీపీ నాయకుల దాడులు, దౌర్జన్యాలకు దిగారు. 2021లో ఎన్నికలు నిర్వహించారు. చాలా చోట్ల బలవంతంగా కూడా ఎస్‌ఎంసీలను సొంతం చేసుకునేలా వైసీపీ మూకలు చెలరేగాయి. పాఠశాలల్లో ప్రశాంతంగా సాగాల్సిన ఎన్నికలను అప్పటి వైసీపీ నాయకులు రాజకీయ రంగు పులిమారు. ఎన్నికైన కమిటీలకు రెండేళ్ల పదవీ కాలం ముగియగానే అప్పటి ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. కొత్త ప్రభుత్వం రావడంతో...ఎన్ని

కసరత్తు పూర్తి

ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 1741 స్కూళ్లలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఈ నెల 1న నోటిఫికేషన్ విడుదల చేశారు. అదే రోజు స్కూళ్లలో నోటీస్ బోర్డుల్లో జాబితా ప్రదర్శించారు. 1741 స్కూళ్లలో 2.01 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, వారి తల్లి లేదా తండ్రి ఓటర్లుగా ఉంటారు. ఈ నెల 5న స్కూళ్లలో ఓటరు జాబితా ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరించారు. అదే రోజు ఓటర్ల తుది జాబితాను నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించారు. గురువారం మధ్యాహ్నం 1 గంటలోపు స్కూళ్లలో ఎస్‌ఎంసీ సభ్యులు, ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలలోపు ప్రమాణస్వీకారం చేయించి 3 గంటలోపు ఎస్‌ఎంసీ తొలి సమావేశం నిర్వహిస్తారు.

పారదర్శకంగా ఎన్నికలు: నాగరాజు, ఏపీసీ, సమగ్రశిక్ష



స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. గురువారం 1741 స్కూళ్లలో ఎన్నికలు జరగనున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎంఈఓలు, ఎమ్మార్వోలు, పోలీసుల సహకారం కూడా తీసుకోవాలని హెచ్‌ఎంలకు సూచించాం. మధ్యాహ్నం 1 గంటలోపు ఎన్నికలు పూర్తికాగానే...3 గంటలకు కొత్త కమిటీలతో తొలి సమావేశాలు నిర్వహిస్తాం.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లోనూ ప్రలోభాలు



గజరాంపల్లిలో వెల్లువెత్తుతున్న ఆరోపణలు

పామిడి, ఆగస్టు 7: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లోనూ ప్రలోభాల పర్వం కొనసాగుతోంది. మండలంలోని గజరాంపల్లి గ్రామ ఎస్‌ఎంసీ ఎన్నికలు వివాదానికి దారి తీస్తున్నాయి. ఎలాగైనా ఎస్‌ఎంసీ చైర్మన్ పదవి దక్కించుకోవాలని కొందరు వైసీపీ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులకు డబ్బులు పంచిపెట్టినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ పాఠశాలలో మొత్తం 38 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో 1వ తరగతిలో 13మంది, 2వ తరగతి లో ఆరుగురు, 3వ తరగతిలో ఎనిమిది మంది, 4వ తరగతిలో ముగ్గురు, 5వ తరగతిలో ఎనిమిది మంది ఉన్నారు. అయితే ఈ ఎన్నికలను వాయిదా వేయాలని ఎంఈఓ జయనాయక్‌కు కొందరు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. దీంతో సోషల్ మీడియాలో ఓ పోస్టు చక్కర్లు కొట్టింది. ఈ విషయమై ఎంఈఓను ఆరా తీయగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ కోసం ఓ పార్టీ నాయకులు ప్రలోభపెడుతున్న మాట వాస్తవమే, కానీ ఈ ఎన్నిక లపై ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎం సానుకూల స్పందన హర్షణీయం

వాటర్ వర్క్స్ కార్మికుల సమస్యలపై ఓబులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 7: సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ సానుకూలంగా స్పందించడం హర్షణీయమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ సమావేశంలో కలెక్టర్ వినోద్‌కుమార్ వాటర్ వర్క్స్ కార్మికుల సమస్యల గురించి ప్రస్తావించగా సత్యసాయి స్కీంకు నిధులు కేటాయించి, సక్రమంగా నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారన్నారు. 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న వాటర్‌వర్క్స్ కార్మికులు అనేక సమస్యలెదుర్కొంటూ వస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నాలుగు నెలలకోసారి సమ్మెలు, నిరసనలు తెలియజేసినా కార్మికుల బకాయి వేతనాలు వచ్చే పరిస్థితి ఉండేది కాదన్నారు. దీనిపై గత నెలలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందించి సమస్యలను తెలియజేయడం జరిగిందన్నారు. ఈ తరుణంలో కార్మికుల సమస్యలపై అనంత కలెక్టర్ ప్రస్తావనకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించడం పట్ల కార్మిక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదేవిధంగా కార్మికుల బకాయి వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ఈ క్రాపింగ్ పకడ్బందీగా చేయాలి

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

అనంతపురం అర్బన్, ఆగస్టు 7: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈ క్రాపింగ్ పకడ్బందీగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. ఆయన బుధవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బందితో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిజమైన సాగుదారులను గుర్తించి ఈ క్రాపింగ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ క్రాపింగ్‌లో నమోదైన వివరాల ఆధారంగా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంట దిగుబడుల కొనుగోలు, ఇతర పథకాలు వర్తింపజేయడం వంటివి చేస్తామన్నారు. ఈ విషయాన్ని రైతులకు వివరించి పంట సాగు చేసిన ప్రతి ఒక్కరు పంట నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

చేనేత, జౌళిశాఖ ఏడీ అప్పాజీ



మాట్లాడుతున్న ఏడీ అప్పాజీ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 7: అంతర్జాతీయ చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచాలని చేనేత కార్మికులు సత్యసాయి జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ అప్పాజీ అన్నారు. అందుకే జాతీయ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. కృష్ణకళా మందిరంలో బుధవారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. చేనేత కుటుంబాల ఆర్థిక సాధికారిత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పథకాలను అమలు చేస్తున్నాయని అన్నారు. ముద్ర రుణాల ద్వారా కార్మికులను ఆదుకుంటున్నాయని అన్నారు. ముడి పదార్థాల సరఫరా పథకం కింద నాణ్యమైన నూలు, మిశ్రమాలను అందజేస్తున్నామని తెలిపారు. ఒక్కో పాసు పుస్తకంపై 15 శాతం రాయితీతో ఆరు కిలోల సిల్క్, నూలు, నిర్దిష్ట స్థల అభివృద్ధి పథకం ద్వారా 90 శాతం ప్రభుత్వ వాటాతో మగ్గం పరికరాలు అందిస్తామని, ఎస్సీ బీసీ కార్పొరేషన్ పెంచిన పథకం ద్వారా నెలకు రూ.4 వేలు ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేనేత కార్మికులకు సూచించారు. అనంతరం చేనేత వృత్తిలో విశేష ప్రతిభ కనబర్చిన కార్మికులను సత్కరించారు. చేనేత, జౌళిశాఖ డీఓ జనవరాజు, ఏడీఓలు పూల శ్రీనివాసులు, నరసింహారెడ్డి, మురళీమోహన్, నాబార్డు డీడీఎం అనురాధ, డీసీసీ ఆదినారాయణ, ఎల్‌డీఎం నర్సింగరావు, సెరికల్చర్ ఆఫీసర్ అంజనేయులు, ఫిషరీస్ డీడీ శ్రీనివాస నాయక్, ఆప్కో డీఎంఓ మధుబాబు పాల్గొన్నారు.

గాలి సోకితే గల్లంతే !

గాలికుంటు వ్యాధితో మూగజీవాల మృత్యువాత

తీవ్రంగా నష్టపోతున్న కాపరులు

నంబులపూలకుంట, ఆగస్టు 7: వాతావరణ మార్పులతో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. వ్యవసాయంలో నష్టాలు రావడంతో చాలామంది జీవనోపాధి కోసం గొర్రెలు, పొట్టేళ్ల పెంపకం చేపట్టారు. అయితే వీటికి గాలికుంటు వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. దీంతో కాపరులు లబోదిబోమంటున్నారు. మండలంలో 1.6లక్షల గొర్రెలు, పొట్టేళ్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గత కొన్నేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో ఉన్నఊరిని, ఇండ్లను వదిలి వేలకొద్ది, చాలా కుటుంబాలు గ్రామాల్లోనే ఉంటూ, గొర్రెలు, పొట్టేళ్ల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు.

పొట్టేళ్ల పెంపకంపై శ్రద్ధ

సాధారణంగా కాపరులు గొర్రెలను మంద పెంపకం ఉపయోగించుకుని పొట్టేళ్లను జీవాలకి విక్రయిస్తుంటారు. అందుకే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు తెచ్చే పొట్టేళ్ల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. పొట్టేలు కంద పట్టడానికి ఉలవలు, మొక్కజొన్న, బియ్యం, పాలు తదితర పౌష్టికాహారం అందిస్తారు. ఈ ఏడాది పొట్టేళ్లకు గాలికుంటు వ్యాధి సోకడంతో కాపరుల ఆశలు ఆడియాశలయ్యాయి. వ్యాధి సోకిన జీవాలకు పశువైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేసి వెళ్తున్నారు. పశువైద్యశాల్లో మందులు లేకపోవడంతో ప్రైవేటు దుకాణాల్లో రూ. వేలు ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్నట్లు కాపరులు వాపోతున్నారు. ఎన్ని మందులు వాడినా రోగం మాత్రం తగ్గడం లేదని కాపరులు ఆవేదన చెందుతున్నారు.



కూడా ఎవరూ కొనుగోలు చేయరు. దీంతో కాపరులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

ముక్కు మూతిలో పసరు వస్తే అంతే

గాలికుంటు వ్యాధి సోకిన జీవాలకు ముందుగా కాలిగిట్టలకు పుండ్లు ఏర్పడతాయి. దీంతో జీవాలు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వెంటనే మూతి నుంచి జొల్లు కారుతుంది. నోటిలో కూడా పుండ్లు ఏర్పడి మేత మేయలేవు. దీంతో జీవాలు నీరసించి, కాలుజడిపోతాయి. వాటిని బయటకు తీసుకెళ్లే వీలు లేక దొడ్డిలోనే ఉంచి వైద్యం అందించాల్సి ఉంటుంది. ముక్కు, మూతినుంచి పసరు వచ్చిందంటే ఇక వాటిపై ఆశలు వదులుకోవాల్సిందే. గాలికుంటు వ్యాధితో చనిపోయిన జీవాల మాంసాన్ని

దోమలతోనే...

గాలికుంటు వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని పశువైద్యులు చెబుతున్నారు. అందుకే కాపరులు వ్యాధి సోకకముందే జీవాలకు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచిస్తున్నారు. దొడ్డిగానీ, పశు గ్రాసానికి వెళ్లిన సమయంలో గ్రాసం పైన ఉండే దోమలు కాటు వేయడం వల్ల వైరస్ వ్యాప్తి చెందుతుందని వారు వెల్లడించారు. వైరస్ వలన నోటిలో ఏర్పడిన పుండు మానితే తప్ప జీవాలు మేత మేయలేని పరిస్థితి. వైరస్ సోకినప్పుడు ప్రతి మూగజీవానికి కాలిగిట్టలు, నోటిలో పుండ్లను ప్రతి రోజు శుభ్రం చేసి, మందులు వేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం టీకాను సద్వినియోగం చేసుకుంటే కొంతవరకూ ప్రయోజనం ఉంటుందని వారు పేర్కొన్నారు.

పది పొట్టేళ్లు చనిపోయాయి



70 పొట్టేళ్లను జత రూ.18వేలతో మూడు నెలల కిందట కొనుగోలు చేశా. పొట్టేళ్లను మేపా. ఈవారం రోజుల్లో గాలికుంటు వ్యాధి సోకి పది పొట్టేళ్లు చనిపోయాయి. దాదాపు రూ.1.2లక్షలు నష్టం వాటిల్లింది. ప్రతిరోజు ఉదయం వ్యాధిసోకిన జీవాలకు పుండ్లు శుభ్రం చేస్తున్నాం. వాటిని చూసిన తర్వాత ఇంటి కెళ్లి అన్నం తింటామంటే తినబుద్ధి కావడం లేదు.

- బండి నాగమున్న, బండారుచెట్టపల్లి

అప్పు ఎలా తీర్చేది..



రూకలకు గొర్రెలు తోలుకున్నా. గత పదిరోజులుగా అమ్మడానికి సిద్ధంగా ఉన్న పొట్టేళ్లు పది చనిపోయాయి. మందులు దరలు అధికంగా ఉన్నాయి. ప్రైవేటు మందుల షాపుల్లో రూ.30వేలు అప్పు చేసి మందులు తెచ్చి వేశా. ఎండాకాలంలో రూ.1.2లక్షలు అప్పు చేసి వేసవికాలం కష్టకాలం కొనుగోలు చేసి జీవాలకు వేశా. ఇంత పెట్టుబడి పెట్టి జీవాలను సంరక్షిస్తుంటే ఒక్కసారి ఇలా వ్యాధి సోకి చనిపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చేది.

- చిన్న నరసింహులు, ఎగువపల్లి

వ్యాక్సిన్ ఒక్కటే మార్గం

గాలికుంటు వ్యాధి మూగజీవాలకు దోమల వలన వ్యాప్తి సోకుతుంది. అందుకు జీవాలకు ఒక్కటే మార్గం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు కుట్టకుండా చర్యలు తీసుకోవాలి. ఈ వ్యాధి సోకిన వాటికి నేరు, కాలి గిట్టలను శుభ్రం చేయాలి.

- బాలనాయక్, పశువైద్యాధికారి

పల్మనరీ విభాగానికి ఐదు పీజీ సీట్లు



ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌కు అభినందనలు తెలుపుతున్న పల్మనరీ విభాగం వైద్యులు

అనంతపురం టౌన్, ఆగస్టు 7: జిల్లా బోధనాస్పత్రిలోని పల్మనరీ విభాగానికి కొత్తగా ఐదు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈమేరకు జాతీయ వైద్యమండలి నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చినట్లు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. ఇప్పటి వరకు వైద్యకళాశాలలో 112 పీజీ సీట్లు ఉండగా కొత్తగా వచ్చిన ఐదు సీట్లతో ఆ సంఖ్య 117కి చేరిందని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. పల్మనరీ విభాగానికి కొత్తగా పీజీ సీట్లు మంజూరుకావడంతో ఆ విభాగం వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

పశుగణన పక్కాగా చేయాలి

పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం

అనంతపురం అర్బన్, ఆగస్టు 7: జిల్లా వ్యాప్తంగా పశుగణన సర్వేను పక్కాగా నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. బుధవారం స్థానిక పశుసంవర్ధక శాఖ అనంతపురం డివిజన్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు పశుగణన సర్వేపై శిక్షణ ఇచ్చారు. జేడీ మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు నెలాఖరుదాకా 21వ భారత పశుగణన సర్వే చేయాలన్నారు. జిల్లాలోని గృహాలు, సంస్థల వద్ద ఉన్న అన్ని జాతుల పశువుల వివరాలను ప్రభుత్వం తయారు చేసిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుగా ఎంపికైన అధికారు లు, సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వేను విజయవంతం చేయాలని సూచించారు.

చీనీ కాయలు టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 7: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.4,500లు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 83టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.25

కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 3వేల టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

ఐటీఐ ప్రవేశాలకు మూడో విడత దరఖాస్తులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 7: ఉమ్మడి జిల్లాలోని ఐటీఐ కళాశాలలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు మూడో విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. 28లోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. అభ్యర్థులు కాంపిటీషన్ నచ్చిన కళాశాలలను ఆన్‌లైన్‌లోనే ఎంచుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి 29న ప్రభుత్వ, 31న ప్రైవేట్ ఐటీఐ కళాశాలలకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

స్పాట్ బిల్లింగ్‌కు టెండర్ల ఆహ్వానం

అనంతపురంరూరల్, ఆగస్టు 7: ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ పరిధిలో స్పాట్ బిల్లింగ్ నిర్వహణకు టెండర్ల ప్రక్రియ బుధవారం నుంచి మొదలైంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని సబ్ డివిజన్ల వారీగా టెండర్లను ఆహ్వానించారు. ఉమ్మడిజిల్లాలో 22సబ్‌డివిజన్లు ఉన్నాయి. వీటిలో సీఈపల్లి, ధర్మవరం, అనంతపురం ఈస్ట్ డివిజన్లను ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేశారు. ఈనెల 22వ తేదీ టెండర్ల దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించారు. ఆశావహులు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల దాఖలు చేసుకోవాలని సంబంధిత అధికారులు వెల్లడించారు.

ఆటోపైకి దూసుకొచ్చిన లారీ

యువకుడి దుర్మరణం



బోల్తాపడిన టమోటా లారీ, మృతిచెందిన శివానంద



గార్లదిన్నె, ఆగస్టు 7: మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఆగి ఉన్న ఆటోను టమోటా లోడుతో వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో శివానంద (22) మృతిచెందాడు. కేశవాపురం గ్రామానికి చెందిన శివ, రమేష్, ముంటిమడుగుకు వంశీ, అనిల్ హమాలీ పనినిమిత్తం మంగళవారం సాయంత్రం కల్లూరుకు వెళ్లారు. పనిముగించుకుని టీ తాగడానికి అర్ధరాత్రి కల్లూరు హైవే పక్కన ఉన్న టీ స్టాల్ వద్దకు వెళ్లారు. అయితే రమేష్, వంశీ ఆటో దిగి టీ తాగుతుండగా అనిల్, శివానంద ఆటోలోనే ఉన్నారు. మదనపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న టమోటా లారీకి వక్కి అదుపు తప్పి ఆటోను ఢీకొంది. దీంతో టీస్టాల్ ముందున్న ఆటోపై వేగంగా దూసుకొచ్చి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న అనిల్ గాయపడగా శివానంద అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. జాతీయ రహదారిపై రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ప్రమాదంలో కుమారుడు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న శివానంద కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ రమణ కన్నుమూత


● విద్యార్థి దశ నుంచి ఉద్యమబాట ● సీపీఐ సంతాపం



ఎంపీ రమణ భౌతిక కాయం వద్ద సీపీఐ నాయకుల నివాళి

అనంతపురం విద్య, ఆగస్టు 7: జిల్లాకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు మాల పాటి వెంకట రమణ (82) వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బుధవారం రాత్రి కన్నుమూశారు. అనంతపురం నగరంలోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో వారం రోజులుగా ఆయన చికిత్స పొందుతున్నారు. ఎంపీ రమణ మృతి పట్ల పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సంతాపం తెలిపారు. ఏఐఎస్ఎఫ్‌లో చేరినప్పటి నుంచి అనేక ఉద్యమాల్లో ఆయన భాగస్వాములయ్యారని, తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఆయనను కోల్పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఎంపీ రమణ కుటుంబ సభ్యులకు సీపీఐ రాష్ట్ర సమితి తరఫున ప్రగాఢ సంతాపం తెలిపారు. బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లికి చెందిన ఆయన విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ చదువుతున్న సమయంలోనే ఉద్యమాల వైపు అడుగులు వేశారు. ఏపీ చరిత్రలో నిలిచిన విశాఖ ఉక్కు ఉద్యమానికి ఆయన కన్వీనర్‌గా పనిచేశారు. తర్వాతి కాలంలో సీపీఐ కళ్యాణదుర్గం తాలూకా కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడిగా, పార్టీ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సమితి సభ్యుడిగా సేవలు అందించారు. ప్రస్తుతం రాష్ట్ర సమితి ప్రత్యేక ఆహ్వానితులుగా కొనసాగుతున్నారు. పార్టీ నాయకులు సదాశివన్, నీలం రాజశేఖర్ రెడ్డి, టీకే ఆదినారాయణ రెడ్డి, పీఎస్ శర్మ, బంగి ఎర్రిస్వామి నాయకత్వంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేశారు. ఆయన మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, సి.మల్లికార్జున, పార్టీ నాయకులు ఎండీ నంజీవప్ప, రాజారెడ్డి, కేశవరెడ్డి, లింగమయ్య, రమణయ్య, శ్రీరాములు, గోపాల్ తదితరులు సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలను గురువారం మధ్యాహ్నం నిర్వహిస్తామని కుమారుడు వేణుగోపాల్ తెలిపారు. ఎంపీ రమణ భౌతికకాయాన్ని గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పార్టీ కార్యాలయానికి తరలిస్తామని, అక్కడి నుంచి అంతిమయాత్ర మొదలౌతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

జీడిపల్లికి కృష్ణా జలాల విడుదల



రాగులపాడు వద్ద రెండు పంపులతో కాలువకు విడుదల అవుతున్న నీరు

ఉరవకొండ, ఆగస్టు 7: కృష్ణా జలాలు జీడిపల్లి రిజర్వాయర్‌కు విడుదలయ్యాయి. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు హంద్రీనీవా కాలువ వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం నుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ నెల ఒకటిన కర్నూలు జిల్లా మల్యాల వద్ద హంద్రీనీవాకు నీటిని వదిలారు. మంగళవారం రాత్రి పంప్‌హౌస్ వద్దకు చేరుకున్నాయి. రెండు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి కాలువకు వదిలారు. 565క్యూసెక్కుల దాకా నీటిని ఎత్తిపోస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాలువకు నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిండుకుండలా తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్, ఆగస్టు 7: తుంగభద్ర జలాశయం నిండుకుండలా ఉంది. తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రం నాటికి 30,208 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో 10 క్రస్ట్ గేట్లు రెండు అడుగులు, మరో 10 గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి నది, కాలువలకు కలిపి మొత్తం 60,211 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. 1633 అడుగులతో 105 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో బుధవారం సాయంత్రం నాటికి 1632.50 అడుగులతో 103.780 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. హెచ్చెల్సీ బొమ్మనహాళ్ సెక్షన్‌లోని 105 వ కి.మీ. వద్ద 1340 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఆగస్టు 7: తమిళనాడులోని వెలంకనిమాత ఉత్సవాలను పురస్కరించుకుని బాంద్రా-వెలంకని (వయా గుంతకల్లు) మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడుపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. బాంద్రా-వెలంకని (09093) ప్రత్యేక రైలు ఈనెల 27, సెప్టెంబరు 6 తేదీల్లో, రాత్రి 9-20 గంటలకు బాంద్రాలో బయలుదేరి రెండవరోజు ఉదయం ఎనిమిదిన్నరకు వెలంకనికి చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణపు రైలు (నెం. 09094) ఈనెల 29, సెప్టెంబరు 8వ తేదీన వెలంకనిలో రాత్రి 10 గంటలకు బయలుదేరి రెండవరోజు మధ్యాహ్నం 3 గంటలకు బాంద్రాకు చేరుతుందన్నారు. ఈ రైలు బోరివలి, పన్వెల్, లోనావలా, పూనా, దౌండ్, షోలాపూర్, కలబురగి, వాడి, క్రిష్ణా, రాయచూరు, గుంతకల్లు, కడప, రేణిగుంట, కాట్పాడి, వెల్లూరు కంటోన్మెంటు, తిరువణ్ణామలై, విల్లుపురం, చిదంబరం, సిర్కాజి, తిరువన్నూరు, నాగపట్టణం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

బీసీ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మస్తాన్



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 7: బీసీ సంక్షేమశాఖ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చిలకల మస్తాన్ ఎన్నికయ్యారు. బుధవారం అమరావతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఎన్నికల్లో ఆయన 50 ఓట్లతో గెలుపొందారు. కర్నూలు, ప్రకాశం, కడప జిల్లాల నుంచి రేసులో పలువురు వార్డెన్లు పోటీపడగా మస్తాన్‌కు 50 ఓట్లు అధికంగా రావడంతో ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

గురుకులాల్లో అదనపు సీట్లను కేటాయించాలి


డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 7: అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో అదనపు సీట్లను కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్‌ను కోరారు. బుధవారం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం బీజేపీ ఎస్సీ రాష్ట్ర కార్యదర్శి మందల శాంతకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో దళిత సామాజిక వర్గాల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపా రు. అయితే గురుకులాల్లో సీట్లను పెంచకుండా గత వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేయడంతో అనేకమంది విద్యార్థులు ప్రవేశాలకు నోచుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రతి పాఠశాలలో సీట్లను పెంచి ప్రవేశాలు కల్పించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నారాయణస్వామి, ఎంఎస్ఎఫ్ నగేష్, చిరంజీవి, జీవీఎస్ మల్లికార్జున, వెంకటేష్, సిద్దార్థ, పక్కీరప్ప పాల్గొన్నారు.

అక్రమ ఉద్యోగోన్నతులు నిలువరించాలి


వీసీ అనితకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 7: వైసీపీ ప్రభుత్వంలో ఎస్కేయూలో అక్రమంగా ఉద్యోగోన్నతులు కల్పించారని, వాటిని కూటమి ప్రభుత్వం నిలువరించాలని ఏఐఎస్ఎఫ్, టీఎన్ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్‌చేశారు. బుధవారం ఇన్‌చార్జి వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబుకు వినతి పత్రాన్ని అందజేవారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ మాజీ వీసీ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ హేమచంద్రారెడ్డి రూ.లక్షల ముడుపులు తీసుకుని అడ్డదారుల్లో ఉద్యోగోన్నతులు కల్పించారని ఆరోపించారు. ఈ విషయాలపై కోర్టుల్లో దావాలు వేసినా వెరవకుండా అక్రమాలను అమలుచేశారని మండిపడ్డారు. నూతన పాలకమండలిని ఏర్పాటుచేసి వీటిపై విచారణచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. నాయకులు నరసింహ యాదవ్, మహేష్, శ్రీను, మారెన్న, నాగేంద్ర, శివశంకర్ పాల్గొన్నారు.

వర్సిటీల పాలనను గాడిన పెట్టాలి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 7: గత వైసీపీ ప్రభుత్వంలో వర్సిటీల పాలన చిన్నాభిన్నమైందని కూటమి ప్రభుత్వం గాడిన పెట్టాల్సిన అవసరముందని ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన పేర్కొన్నారు. బుధవారం ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో ఎస్కేయూ పరిపాలనా భవనం వద్ద ఆందోళన చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన వేమన మాట్లాడుతూ ఎస్కేయూ, జేఎన్‌టీయూలోని కొందరు అధికారులు వైసీపీ నాయకుల్లా వ్యవహరించి నిబంధనలు తుంగలో తొక్కారని విమర్శించారు. తప్పుడు జీవోలను సృష్టించి వాటిద్వారా ప్రయోజనాలు పొందారని మండిపడ్డారు. మరోవైపు గత ప్రభుత్వంలో ఇన్‌చార్జులుగా బాధ్యతలు తీసుకుని నేటికి కొనసాగుతుండటం కూటమి ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టడమేనని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అక్రమాలపై దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. నాయకులు వంశీకృష్ణ, లింగన్న, కృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి, ఆగస్టు 7: మండలంలోని నసనకోట ఎంజేపీ పాఠశాలలో టీజీటీ ఇంగ్లీషు, టీజీటీ హిందీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మహిళలు మాత్రమే అర్హులని, 9వ తేదీన డెమో క్లాసులకు హాజరుకావాలని ఆమె కోరారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐఎస్ఓ ప్రతినిధులతో వ్యవసాయ అధికారుల మంతనాలు


వ్యవసాయ అధికారులతో చర్చిస్తున్న ఐఎస్ఓ సంస్థ ప్రతినిధులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 7: జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్ మంజూరు కోసం ఐఎస్ఓ సంస్థ ప్రతినిధులు ప్రసాద్, సింగయ్య ఆ శాఖ అధికారులతో మంతనాలు జరిపారు. బుధవారం జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఆ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, టెక్నికల్ ఏఓలు వెంకటకుమార్, రాకేష్, బాలూనాయక్, ఇతర అధికారులతో ఐఎస్ఓ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. రైతులకు అందిస్తున్న సేవలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టెక్నికల్ ఏఓలతోపాటు ఇతర విభాగాల్లో వ్యక్తిగతంగా సంబంధిత అధికారులతో వివరాలు సేకరించారు. అనంతరం స్థానిక ఎఫ్‌సీఓ ల్యాబ్, అనంతపురం రూరల్ మండలం ఏ నారాయణపురంలోని రైతు సేవాకేంద్రాన్ని పరిశీలించారు.

అప్పుల బాధతో హమాలీ ఆత్మహత్య

గార్లదిన్నె, ఆగస్టు 7: మండలంలోని మర్తాడు గ్రామంలో సూర్యనారాయణరెడ్డి (45) అనే వ్యక్తి హమాలీ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు సూర్యనారాయణరెడ్డి అనంతపురంలోని ఓ ఐరన్ షాపులో హమాలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. సూర్యనారాయణరెడ్డి భార్య సుజాత కొంతకాలం అనారోగ్యానికి గురైంది. దీంతో కుటుంబ పోషణకు, భార్య వైద్యం కోసం రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక సూర్యనారాయణరెడ్డి మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఆత్మహత్యపై ఆరా తీశారు. సూర్యనారాయణకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

శింగనమల ఆగస్టు 7: తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం మండలంలోని జూలాకాలువ అంగన్‌వాడీ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ఉమాదేవి మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపడం ద్వారా బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, ఓబుళమ్మ, సునంద పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు

జగన్‌రెడ్డీ.. అధికారం పోయినా కుట్రలు మానవా..?

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

అనంతపురం అర్బన్, ఆగస్టు 7: జగన్‌రెడ్డీ... అధికారం పోయినా నీ కుట్రలు మానవా..? అంటూ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం అనంతపురం నగరంలోని నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు కుళ్లు, కుతంత్రాలతో పాలన సాగిందని, ఇప్పుడు అధికారం పోయినా పైశాచిక చర్యలు మానడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మంచి జరగడం జగన్‌కు ఇష్టం లేదన్నారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చిన నెల రోజుల నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని విమర్శలు చేయడంతోపాటు ఎవరు ఎక్కడ వ్యక్తిగతంగా దాడులు చేసుకున్నా వాటిని టీడీపీకి ఆపాదిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కుట్రలు పన్నుతున్నారన్నారు. 30 రోజుల్లో 36 మంది వైసీపీ నాయకులు హత్యకు గురయ్యారని ఢిల్లీలో ప్రచారం చేశారని, వారి వివరాలు ఇవ్వమంటే సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారన్నారు. నీ హయాంలో ఎంత దౌర్జన్యకాండ జరిగిందో చెప్పేందుకు రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన సంఘటనలే చాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడైనా అలాంటి సంఘటనలు జరిగాయా అని ప్రశ్నించారు. ఐదేళ్లుగా జరిగిన వ్యవస్థల విధ్వంసాన్ని సీఎం చంద్రబాబు ఇప్పుడిప్పుడే గాడిలోపెడుతున్నారని, శాంతిభద్రతలను పరిరక్షించడం ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు ఆకర్షించాలని ఆయన తపిస్తున్నారన్నారు. జగన్ చేస్తున్న కుట్రలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చేనేతలకు చేయూతనిచ్చేది చంద్రబాబే

● పద్మశాలి సంఘం నాయకులు


కేక్ కట్ చేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 7: చేనేతలకు చేయూతనిచ్చేది సీఎం చంద్రబాబునాయుడేనని పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక క్లాక్ టవర్ సమీపంలోని చేనేత, జౌళి శాఖ కార్యాలయం వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జింకా సూర్యనారాయణ, పోతుల లక్ష్మీనరసింహులు, నాయకులు రవీంద్ర, రాజశేఖర్, సత్యనారాయణ, వెంకటరామయ్య, వెంకటేష్, వెంకటరాముడు, రమేష్, లక్ష్మీనారాయణ, శివకుమార్, కడియాల కొండన్న పాల్గొన్నారు.

చేనేతలకు సన్మానం

అనంతపురం రూరల్: మండలంలోని సిండికేట్ నగర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చేనేతలను సన్మానించారు. బుధవారం జాతీయ చేనేతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు, టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. సీనియర్ చేనేతలను శాలువా, పూలమాలలతో సత్కరించారు. చేనేత రంగానికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి పోతుల నరసింహులు, గౌరవాధ్యక్షులు రవీంద్ర, రాజశేఖర్, జానపాటి సత్యనారాయణ, జాక్కా వెంకట్ రామయ్య పాల్గొన్నారు.


చేనేత కార్మికులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నేతలు


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గార్లదిన్నె, ఆగస్టు 7: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బండారు ఈరమ్మను టీడీపీ నేతలు కలిశారు. బుధవారం మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులతో కలసి తహసీల్దార్‌ను కలిసి శాలువాలతో సన్మానించి శుభకాంక్షలు తెలిపారు. అనంతరం గార్లదిన్నె కమిటీ హాల్‌లో జరిగిన తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 20 మంది గర్భిణులకు టూమెన్ కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డితో పాటు మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, గుర్రం ఆదినారాయణ, గేట్కుక్రిష్ణారెడ్డి, గుత్తాబాలకృష్ణ, శేఖర్, నరసింహారెడ్డి, చితంబరప్ప, వడ్డేవన్నూర్, సుంకన్న, బాబయ్యా రాము, జయరాం, వెంకట్రామిరెడ్డి, రామచంద్ర, కొడిదల శీనా ఉన్నారు.

శాకంబరిగా శారదామాత



అనంతపురం కల్చరల్, ఆగస్టు 7: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని బుధవారం శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో శారదామాత శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిరాట్‌ను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. మఠం కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.

కార్డుదారులందరికీ సకాలంలో రేషన్

రాప్తాడు, ఆగస్టు 7: కార్డుదారులందరికీ సకాలంలో రేషన్ అందేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి తెలిపారు. మండలంలోని నిచాపట్ల, మరూరు, ఎం.చెర్లోపల్లి, పాలబావి గ్రామాల్లో కొత్త డీలర్లు రేషన్ పంపిణీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిర్ణీత సమయం వరకూ రేషన్ పంపిణీ చేయాలన్నారు. కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గంగలకుంట రమణ, నాయకులు బాబయ్య, కేశవ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మరూరులో బియ్యం పంపిణీ చేస్తున్న మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి

పారిశుధ్య కార్మికుల డిమాండ్లు పరిష్కరించండి


ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం టౌన్, ఆగస్టు 7: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు కోరారు. బుధవారం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏఐయూటీసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగునెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో శుక్రవారం నుంచి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యంకు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడు, చిరంజీవి, కృష్ణుడు, కార్మికులు పాల్గొన్నారు.

రేపు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 7: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పాతూరులోని గిరిజన భవనంలో నిర్వహిస్తున్న వేడుకలకు కలెక్టర్ హాజరవుతున్నారన్నారు. జిల్లాలోని అన్ని ప్రజా సంఘాలు, గిరిజన నాయకులు, గిరిజన సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కట్టుకోనివ్వండి

● కలెక్టర్‌కు విన్నవించిన అంగన్‌వాడీలు

అనంతపురంరూరల్, ఆగస్టు 7: మాకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కట్టుకునేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్లు కలెక్టర్ వినోద్ కుమార్‌ను కోరారు. బుధవారం ఆ మేరకు అంగన్‌వాడీ వర్కర్లు కలెక్టర్‌ను కలసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ 2004 నుంచి బీఎల్‌ఓలుగా పనిచేస్తున్న తమకు 2011లో 69 మందికి ఉప్పరపల్లి గ్రామ సర్వేనెంబరు 107-1నుంచి7 సర్వే నెంబరులో ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంటు చొప్పున స్థలం ఇచ్చారన్నారు. ప్రస్తుతం అనంతపురం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న ప్రతాప్‌రెడ్డి ఆ భూమిలో కొలతలు వేసి స్థలాలు కేటాయించారన్నారు. స్థానికంగా ఇంటి నిర్మాణాలకు అనువుగా లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేదన్నారు. అయితే బంగి భాస్కర్, అతని కుటుంబ సభ్యులు ఇళ్ల నిర్మాణాలకు అడ్డుపడుతున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలసి సమస్యను పరిష్కరించాలని కోరామన్నారు. కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ


విద్యార్థుల నుంచి విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 7: వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సీపీఎం నాయకులు విరాళాల సేకరణ చేపట్టారు. బుధవారం మండలంలోని మన్నీల గ్రామంలో మండల కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి విరాళాలు సేకరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ వంతు సాయాన్ని అందించారు. నాయకులు ఈశ్వరయ్య, బాబు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించండి: ఏఓ

అనంతపురంరూరల్, ఆగస్టు 7: రైతులు ఈపంట నమోదు చేయించుకోవాలని ఏఓ శశికళ సూచించారు. బుధవారం మండలంలోని రాచానపల్లిలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఓ మాట్లాడుతూ.. రైతులు సచివాలయంలోని ఉద్యోగులతో పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఏఈఓ మురళీకృష్ణ, వీఆర్వో రమేష్, వ్యవసాయ సహాయకులు శివశంకర్, విజయకుమార్ పాల్గొన్నారు.

రాప్తాడు: రైతులు సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు కోరారు. మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం చీనీ, ద్రాక్ష తదితర పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలోని రైతు సేవ కేంద్రం దగ్గరికి వెళ్లి వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా ఈ క్రాప్ చేయించాలన్నారు. ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్, వీహెచ్ఏ ప్రియ, లత విఆర్ఓ నాయక్ పాల్గొన్నారు.

శింగనమల: కౌలురైతులు పంటనమోదు చేయించుకోవాలని వీఆర్వో ఎర్రితాతయ్య తెలిపారు. బుధవారం రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులతో రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారారులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు తప్పకూండా పంటనమోదు చేసుకోవాలన్నారు. రైతులు పెద్దనాగముని, వెంకటేశ్, వెంకటనారాయణ మాసూల ప్రకాశ్, నారాయణస్వామి, విజయ్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసే రైతులందరూ ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ బండారు ఈరమ్మ సూచించారు. బుధవారం రైతు భరోసా కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో ఈ పంట నమోదు, రైతు సేవా కేంద్రాల పై విఆర్వోలకు, సర్వేయర్లకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మండలంలోని రైతులు వివిధ పంటలు సాగుచేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు వర్తించాలంటే తప్పనిసరిగా ప్రతి రైతు ఈపంట నమోదు, ఈకేవైసీ చేసుకోవాలన్నారు. సర్వేయర్ శామలదేవి, ఏఎస్ఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.


రాచానపల్లిలో పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి

పబ్లిసిటీ పిచ్చితో రూ.700 కోట్లు దుర్వినియోగం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, ఆగస్టు 7: జగన్‌రెడ్డి పబ్లిసిటీ పిచ్చితో రూ.700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ పాలనలో అనాలోచిత నిర్ణయాలకు కోట్లాది రూపాయల ప్రభుత్వ, ప్రజాసొమ్ము దుర్వినియోగం అవ్వడంతోపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అలాంటి వాటిలో అన్ని మార్పులు తీసుకొస్తూ సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. భూముల సర్వే రాళ్లు, పట్టాదారుపుస్తకాలపై మాజీ సీఎం జగన్ బొమ్మలు తొలగించడంపై క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. జగన్ బొమ్మలున్న పట్టాదారుపుస్తకాలను వెనక్కి తీసుకొని, రాజముద్రతో కూడిన పట్టాదారుపుస్తకాలను త్వరలో పంపిణీ చేస్తారన్నారు. రీసర్వే మూలంగా తలెత్తిన వివాదాలకు ప్రభుత్వం త్వరలో చెక్ పెడుతుందన్నారు. గత ప్రభుత్వంలో జగన్ ధనదాహంతో కల్తీమద్యాన్ని అధిక ధరలకు విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారన్నారు. అక్టోబరు 1 నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేయనున్నారన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో బిహార్ ఏకపక్ష విజయం


విజయం సాధించిన బిహార్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7: జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో బిహార్ ఏకపక్షంగా విజయం సాధించింది. జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్-2024-25 పోటీలు బుధవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఐదోరోజు కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్‌పై జార్ఖండ్ విజయం సాధించింది. హిమాచల్‌ప్రదేశ్‌పై జరిగిన మ్యాచ్‌లో బిహార్ 20పాయింట్ల తేడాతో గెలుపొందింది. కార్యక్రమంలో సీఐ తబ్రేజ్, ఎస్ఎస్‌బీఎన్ విశ్రాంత ప్రిన్సిపాల్ రమేష్ నారాయణ, నెహ్రూ యువకేంద్రం జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాసులు, జనసేన పార్టీ నాయకులు పత్తి చంద్రశేఖర్, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి బి మల్లేష్, కార్యవర్గసభ్యుడు రాజా, ఆర్డీటీ హెడ్ కోచ్ దాదా ఖలందర్, శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

10 నుంచి సాఫ్ట్‌బాల్ పోటీలు


సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన బాలబాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7: రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు 10వ తేదీ నుంచి గుంటూరు జిల్లా వినుకొండలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు తెలిపారు. ఎంపికైన జిల్లా సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్లకు వారం రోజులుగా స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరం బుధవారం ముగిసింది. ఎంపికైన జట్ల వివరాలను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ వెంకటేశులు ప్రకటించారు. సీనియర్ బాలుర జట్టులో మహేష్, వరుణ్‌కుమార్, అక్షయ్‌సాగర్, పృథ్వీరాజ్, శివకుమార్, జయవర్ధన్ చౌదరి, సింహాద్రి, లక్ష్మీనారాయణ, వినోద్, లక్ష్మీకళ్యాణ్, తరుణ్‌సాయి, అరవింద్, ధనుష్, రంజిత్ కుమార్, నవీన్‌కుమార్, భరత్‌చంద్ర ఉన్నారు. సీనియర్ బాలికల జట్టులో లావణ్య, లక్ష్మీ, స్రవంతి, ధరణి, జ్యోతి, మౌనిక, శిరీష, బసంతి, సుకన్య, నిహారిక, ప్రశాంతి, ఉషారాణి, మునీషా, జి నిహారిక, రిష్మిత, సనాసమ్రీన్‌లు ఉన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న జట్లు ఆగస్టు 10వతేదీ నుంచి వినుకొండలో, జూనియర్ జట్లు ఆగస్టు 17వతేదీ నుంచి శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసి విజయంతో జాతీయ పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రాగి మురళీ, శేఖర్, టీచర్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు ముందంజ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు ముందంజలో నిలిచింది. రెండు రోజులుగా నెల్లూరు జిల్లా వెంకటగిరిలో నిర్వహిస్తున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సీనియర్ క్రికెట్ పోటీల్లో చిత్తూరు జట్టు 98.5 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 467పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 117.3ఓవర్లలో 554 భారీ పరుగులు సాధించింది. ఇందులో జిల్లా బ్యాటర్లు రాజుకుళ్లాయప్ప 124పరుగులు, గిరినాథ్‌రెడ్డి 95పరుగులు, మహేంద్రరెడ్డి 81, యోగానంద 50పరుగులు చేశారు. డ్రాగా ముగిసిన మ్యాచ్‌లో జిల్లా జట్టు ఇన్నింగ్ ముందంజలో నిలిచిందని క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు.

క్రికెట్ పోటీల్లో చైత్రవర్ధన్ ప్రతిభ



అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారుడు చైత్రవర్ధన్ ప్రతిభ చాటాడు. నెల్లూరు జిల్లా వెంకటగిరిలో నిర్వహిస్తున్న పోటీల్లో చిత్తూరుతో జరిగిన మ్యాచ్‌లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించిన చైత్రవర్ధన్ 72 పరుగులు చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. జట్టును ముందంజలో ఉంచడానికి చైత్రవర్ధన్ కీలకపాత్ర పోషించాడు.

10న జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 7: జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు 10వతేదీన ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, రఫీయుద్దీన్ తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పదోతరగతి మార్కుల జాబితా, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు కదిరిలో 17వ తేదీ నుంచి నిర్వహించే 46వ ఏపీ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 9949942494, 8639138569 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు నాగదేవతల సాంస్కృతిక సంబరాలు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 7: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అనంతనాగ్ సంగీత స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో గురువారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు నాగదేవతల సాంస్కృతిక సంబరాలు నిర్వహించనున్నట్లు వీఆర్ఓ నాగిన్ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సర్పసూక్త హోమం, రామాంజనేయ భజన బృందంచే భజనలు, మధ్యాహ్నం 12 గంటలకు కళాకారులచే సంప్రదాయ నృత్యప్రదర్శనలు, 1.30 గంటలకు వీరయ్య బృందంచే బృందగానం, 3.30 గంటలకు కృష్ణవేణి బృందంచే డప్పు బృందగానం, సాయంత్రం 4 గంటలకు నాగదేవతల నగరోత్సవం, కళాప్రదర్శనలు, 6 నుంచి రాత్రి 9 గంటల వరకు గీతాలాపనలు, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని సంబరాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

యల్లనూరు, ఆగస్టు7: మండలకేంద్రంలోని ఎంపీడీ ఓ కార్యాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు సర్పంచులకు శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీలో నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమాలు, నిధులను ఎలా ఖర్చు చేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. మండలంలోని 21పంచాయతీలకు చెందిన సర్పంచులు శిక్షణకు హాజరుకావాలని సూచించారు.

12 నుంచి శిక్షణ తరగతులు

రాయదుర్గం రూరల్, ఆగస్టు 7: మండలంలోని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ బుధవారం తెలిపారు. ఈనెల 12 నుంచి 14 వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు

యాడికి, ఆగస్టు7: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా ప్రతాప్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన యాడికి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నూతన తహసీల్దార్‌గా భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సుభాకర్‌రావు నంద్యాలకు బదిలీపై వెళ్లారు. అనంతపురం ఎన్నికల సూపరింటెండెంట్‌గా ఉన్న చేస్తున్న భాస్కర్‌ను కళ్యాణదుర్గం తహసీల్దార్‌గా నియ మించారు. రెవెన్యూ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

ఏపీఓగా భాగ్యలక్ష్మి

బొమ్మనహాళ్, ఆగస్టు 7: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓగా భాగ్యలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. గత ఏడాది ఇక్కడ ఏపీఓగా పనిచేస్తున్న సంజీవ్‌కుమార్ ఉరవకొండకు బదిలీ అయ్యారు. అప్పటి నుండి టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ ఇన్‌చార్జి ఏపీఓగా ఉన్నారు. పుట్లూరు మండలం నుంచి భాగ్యలక్ష్మిని బదిలీ చేయడంతో బాధ్యతలు తీసుకున్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

గుంతకల్లు టౌన్, ఆగస్టు 7: పంటలు సాగు చేసేటప్పుడు తప్పని సరిగా విత్తన శుద్ధి చేపట్టాలని ఏడీఏ పద్మజ సూచించారు. మండలంలోని దంచర్ల గ్రామంలో బుధవారం ఆమె రైతులకు పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంటల సాగుకు ముందు విత్తన శుద్ధి తప్పక చేయాలన్నారు. కంచెపంటలు వేసుకోవడం వలన పురుగుల ఉధృతి తగ్గుతుందన్నారు. అనంతరం నాగరాజు అనే రైతు సాగు చేసిన వేరుశనగ పంటలో సస్యరక్షణలో భాగంగా వేప నూనెను స్ర్పే చేయించారు. కార్యక్రమంలో ఏఓ స్వాతి, వీఏఏలు ప్రకృతి సేద్యం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు7: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15వ తేదీన ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఇల్లూరు లక్ష్మీనారాయణ భవనంలో బుధవారం వారు సమావేశమై ఈ మేరకు మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్, అసెంబ్లీ కన్వీనర్ బండారు కృష్ణమూర్తి, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, పట్టణ అధ్యక్షురాలు చిన్న కళావతి, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లు టౌన్, ఆగస్టు 7: పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను మున్సిపల్ అధికారులు తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన పట్టణ, మండల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదల ఇళ్ల స్థలాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని, మున్సిపల్ అధికారులు వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయకార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజినేయలు, నాయకులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

ఉరవకొండ, ఆగస్టు7: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని టవర్‌క్లాక్ కూడలిలో బుధవారం వారు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. 30ఏళ్ల సుదీర్ఘపోరాటఫలితమే ఎస్సీ వర్గీకరణ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రవి, చెన్నప్ప, రామాంజినేయులు, టీడీపీ నాయకులు, చంద్రశేఖర్, పెద్దన్న, వెంకటేశులు, సుధాకర్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

కుందుర్పి, ఆగస్టు 7: నిద్రిస్తున్న మహిళల మెడలో బంగారు గొలుసును దొంగలించిన ఘటన మండలంలోని జంబుగుంపల గ్రామంలో బుధవారం జరిగింది. భాగ్యమ్మ అనే మహిళ మంగళవారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన గంట గంగాధర ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వెంబడించారు. అయినా దొరకలేదు. చైన్ నాలుగు తులాలు ఉందని బాధితురాలు వాపోయింది. అనంతరం ఆమె బుధవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటస్వామి కేసు నమోదు చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, విచారణ అనంతరం అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

అంబులెన్స్ ప్రారంభం

ఉరవకొండ, ఆగస్టు 7: జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద అంబులెన్స్‌కు పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విడపనకల్లు మండల నాయకుడు ధనుంజయ అంబులెన్స్ ఏర్పాటుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. ధనుంజయ మాట్లాడుతూ విడపనకల్లు మండల ప్రజలకు ఈ అంబులెన్స్ సదుపాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, చంద్రశేఖర్, కేశవ, సుధీర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి ● పలు గ్రామాల్లో పర్యటన

యాడికి, ఆగస్టు 7: గ్రామాల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దైవాలమడుగు, కేశవరాయునిపేట, లక్ష్ముంపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్థులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దైవాలమడుగులో తాగునీటిపైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని, డ్రైనేజీ నీరు పోయే బావిలో పూడిక మట్టి తీయించాలని గ్రామస్థులు కోరారు. కేశవరాయునిపేటలో నడవలేనిస్థితిలో ఉన్న వారికి ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు ఇచ్చేలా చూడాలని, గ్రామంలో సీసీరోడ్లు వేయించాలని కోరారు. లక్ష్ముంపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, దీనికోసం బోరువేయాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. మరికొన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. అర్హులైన వారందరికీ పింఛన్లు అందేలా చేస్తామని తెలిపారు. నకిలీ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్న వారిపై అధికారులు విచారణ జరపాలని, బోగస్ పింఛన్లు తీసేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ సావిత్రి, ఎంఈఓ కాశప్ప, ట్రాన్స్‌కో ఏఈ రాజారావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవకుమార్, పీఆర్ జేఈ ఆదినారాయణ, ఏపీఎం చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, పరిమి చరణ్, చలమారెడ్డి, రవికుమార్‌రెడ్డి, త్రినాథ్‌రెడ్డి, నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దైవాలమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

విద్యతోపాటు విలువలు నేర్పండి

విద్యార్థులకు విద్యతోపాటు విలువలు కూడా నేర్పాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. దైవాలమడుగు, కేశవరాయునిపేట, లక్ష్ముంపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన ఆయా గ్రామాలలోని పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాటాడి మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి ఆరాతీశారు. విద్యార్థులు టీవీలు, మొబైల్ ఫోన్లకు వ్యసనపరులు కాకుండా ఆటలపై, చదువుపై దృష్టి పెట్టేలా చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రజలకు మెరుగైన పాలన అందిద్దాం: ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, ఆగస్టు 7: పార్టీలతో సంబంధం లేకుండా పాలకులంతా సమష్టిగా పనిచేసి ప్రజలకు మెరుగైన పాలన అందిద్దామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు ఎన్నో ఆశలతో మనల్ని గెలిపించి పాలకులుగా ఎన్నుకున్నారన్నారు. కనుక వారికి మెరుగైన పాలన అందించడానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత తమదేనన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల్లో ప్రతి పైసాను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచులు, ఎంపీటీసీల సభ్యులకు సూచించారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో తెచ్చిన 117 జీఓ వల్ల 3, 4, 5 తరగతుల విద్యార్థులు పాఠశాలలకు దూరమవుతూ డ్రాప్ అవుట్స్‌గా మిగులుతున్నారని, ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ వచ్చే డిసెంబర్‌లో జరిగే ఉపాధ్యాయ పోస్టుల నియామకంలో భర్తీ చేయిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో సమస్యలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గూడెన్న, తహసీల్దార్ ఫణికుమార్, ఇన్‌చార్జి ఎంపీపీ లీలావతి, జడ్పీటీసీ మెంబర్ పద్మావతి, ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీశంకర్, ఏఓ శ్రావణ్‌కుమార్, వైద్యులు విజయకుమార్ నాయక్, చంద్రశేఖర్, సర్పంచులు రుద్రముని, జయరాంచౌదరి, ఎంపీటీసీ సభ్యులు నరేంద్ర, కేశవరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలి

● జాతీయ చేనేత దినోత్సవంలో వక్తల పిలుపు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 7: చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పట్టణంలోని ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య పిలుపునిచ్చారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, మహిళాసాధికారిక విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలు భారతీయ సంప్రదాయం, కళలకు ప్రతిబింబాలన్నారు. ఆ వస్త్రాలను ఆదరించి చేనేత కార్మికులకు చేయూత ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థినులు చేనేత వస్త్రధారణలో అలరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి నారాయణ, ఉమెన్ ఎంప్లాయ్‌మెంట్ అధికారిణి వాణిశ్రీ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ చేనేతరంగాన్ని ఆదుకొని పూర్వవైభవం తీసుకువచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో చేనేత రంగాన్ని నమ్ముకొని వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. పోచంపల్లి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, వెంకటగిరి ప్రాంతాల చీరలకు దేశవిదేశాల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. అంతకుమునుపు చేనేత రంగంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయభాస్కర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


ఎస్‌కేపీ డిగ్రీ కాలేజీలో చేనేత వస్త్రధారణలో విద్యార్థినులు

రాయదుర్గంరూరల్: పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర, అర్థశాస్త్రం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చేనేత పరిశ్రమ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ దొడ్డనాగప్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ: జాతీయ చేనేత దినోత్సవాన్ని పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ చేనేత విభాగం నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే చేనేత రంగానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చేనేత కార్మికులకు సబ్సిడీ కింద రేషం, చేనేత పరికరాలను ఇచ్చిన ఘనత టీడీపీదే అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు చందా రాము, రాజేష్, టీరే శేఖర్, నిమ్మల ప్రసాద్, అమరేష్, పల్లా నరసింహులు, ప్రభాకర్ ,సుదర్శన్, వీరేష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

విడపనకల్లు, ఆగస్టు 7: మండలంలోని గడేకల్లు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. విడపనకల్లు పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బళ్లారికి చెందిన హేమంత్ భార్య జానకమ్మ, కొడుకు తిరుమలతో కలిసి ప్రొద్దుటూరుకు కారులో బుధవారం మధ్యాహ్నం బయలు దేరారు. గడేకల్లు వద్దకు రాగానే ఎదురుగా బొగ్గులోడుతో వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ఉన్న హేమంత్‌కు, ఆయన భార్య జానకమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కొడుకు తిరుమలకు స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందుభాగం నుజ్జు నుజ్జు అయ్యింది. స్థానికులు క్షతగాత్రులను బళ్లారి ఆసుపత్రికి తరలించారు.

మాజీ వలంటీర్ అనుమానాస్పద మృతి

యాడికి, ఆగస్టు7: మండలంలోని చందన గ్రామ శివాలయం సమీపాన దోనెలో పడి మాజీ గ్రామ వలంటీర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దవడుగూరు మండలం రావులుడికి గ్రామానికి చెందిన చిన్నలాల్ స్వామి (37) గతంలో వలంటీర్‌గా పనిచేసేవాడు. అలాగే గ్రామంలో చిల్లర బంకు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య శాంతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్నలాల్‌స్వామికి మద్యం అలవాటు ఉంది. కాగా గత సోమవారం సాయంత్రం రాయలచెరువుకు వెళ్లి వస్తానని కుటుంబసభ్యులకు తెలిపి బైక్‌పై వెళ్లాడు. తర్వాత తిరిగి రాలేదు. బుధవారం సాయంత్రం చందన గ్రామశివారులోని శివాలయం వద్ద దోనెలోని నీటిలో వ్యక్తి మృతదేహాన్ని ఆలయ పూజారి గమనించి స్థానికులకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులకు ఘటనాస్థలికి వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. ఆలయ సమీపంలో రెండురోజులుగా ఉన్న బైక్‌ను గమనించారు. వాటిలోని వివరాల ఆధారంగా మృతుడు చిన్నలాల్‌స్వామిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం తెలపగా.. వారు వచ్చి చిన్నలాల్‌స్వామిగా నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.


చిన్నలాల్‌స్వామి (ఫైల్)

చందన శివాలయం వద్దకు ఎందుకు వచ్చినట్లు?

రాయలచెరువు గ్రామానికి వెళ్లి వస్తానని చెప్పిన చిన్నలాల్‌స్వామి చందన గ్రామశివారులోని శివాలయం వద్దకు ఎందుకు వచ్చాడు. బైక్‌ను శివాలయం సమీపంలో ఎందుకు పార్క్ చేసి వెళ్లాడు. దోనెలో ఎలా పడ్డాడు అనే సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. దోనె పైభాగాన కూర్చొని మద్యం సేవించాడా? మద్యం మత్తులోనే దోనెలో పడ్డాడా, మరేమైనా జరిగిందా అని సంఘటన ప్రదేశానికి చేరుకున్న స్థానికులు చర్చించుకోవడం క నిపించింది. అసలేం జరిగిందనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

టీడీపీ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా

పుట్లూరు, ఆగస్టు7: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో టీడీపీ నాయకులు జయుడు, రాజేష్‌నాయుడు బుధవారం ట్యాంకర్లద్వారా ఉచిత తాగునీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీల సహకారంతో గ్రామంలో ఉచితంగా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నేపథ్యంలో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలు సకాలంలో రాకపోవడంతో భూగర్భజలా లు అడుగంటిపోయి బోర్లలో నీరు రావ డం లేద న్నారు. దీం తో ప్రతి రోజూ ఐదు ట్యాంకర్ల చొప్పున సరఫరా చేస్తామని వారు తెలిపారు.


ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

సీఎంను కలిసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు టౌన్, ఆగస్టు 7: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ విజయవాడలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గ అభివృద్ధి గురించి ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.


సీఎంతో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

చికిత్స పొందుతున్న మహిళ మృతి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 7: పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీలో పార్వతి (33) అనే మహిళపై ప్రియుడు మోహన్ మంగళవారం పెట్రోల్ పోసి నిప్పటించిన విషయం విదితమే. తీవ్రంగా గాయపడిన ఆమె అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె ఉన్నట్లు చెప్పారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ఘనంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పుట్లూరు, ఆగస్టు 7: మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో బుధవారం అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో తొలుత హోమాలు, ఇతర పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, అలంకరణలు చేసి వేద మంత్రోచ్చారణల నడుమ ప్రతిష్ఠ జరిపారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


ప్రతిష్ఠ అయిన అమ్మవారు

లక్ష్మీనారాయణ స్వామికి వెండి ఆభరణాల సమర్పణ

గుంతకల్లు టౌన్, ఆగస్టు 7: మండలంలోని కసాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామికి పట్టణానికి చెందిన లక్ష్మన్న, ఈశ్వరి దంపతులు వెండి ఆభరణాలను బుధవారం సమర్పించారు. రూ. 6 లక్షలు విలువ చేసే వెండి ఆభరణాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తలారి పరుశురాముడుకు అందించారు. అనంతరం వెండి ఆభరణాలు స్వామి వారికి అలంకరణ చేసి పూజలు చేశారు. దంపతులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు స్వామి వారిని దర్శించుకున్నారు.


వెండి ఆభరణాల అలంకరణలో స్వామి వారు

డ్రైనేజీ నిర్మాణానికి నిధుల మంజూరు

బెళుగుప్ప, ఆగస్టు 7: మండలకేంద్రంలోని కేజీబీవీలో డ్రైనేజీ నిర్మాణానికి రూ. రెండు లక్షలు మంజూరైనట్లు టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాయకుడు పెద్ద తిప్పయ్య తెలిపారు. పనులు ప్రారంభించేందుకు ఎంఈవో మల్లారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ షాప్రిన, జేఈ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి టీడీపీ నాయకులు బుధవారం కేజీబీవీ కెళ్లి పరిశీలించారు. సమస్యను పరిష్కరించేందుకు పయ్యావుల సోదరులు చొరవ చూపడంపై ఎస్‌వో నాగరత్నబాయి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

యాడికి, ఆగస్టు7: మండలకేంద్రంలోని భైరవకొండపై వెలసిన విజయాంబికా భైరవ లింగేశ్వర స్వామి ఆలయ 49వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భైరవలింగేశ్వరున్ని, విజయాంబికాదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

తాడిపత్రి, ఆగస్టు7: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం పట్టణంలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని సుంకులమ్మపాలెంలోని చర్చివద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. మాలమహానాడు నియోజకవర్గ గౌరవ సలహాదారులు బింగి ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపట్టరాదని డిమాండ్ చేశారు. ర్యాలీలో అధ్యక్షుడు శీనయ్య, కౌన్సిలర్ విజ్జి, ఓబులేసు, బింగి రాజశేఖర్, రవి, దొరస్వామి, దేవపుత్ర, సూరి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

పామిడి, ఆగస్టు 7: పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు కొల్లగొడుతూ రైతన్నల కంట కన్నీరు పెట్టిస్తున్నారు. మంగళవారం రాత్రి నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని రాగివైర్లు దొంగలించినట్లు ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు. పామిడి స్టేషన్ గ్రామం వద్ద రెండు, కొండూరు రోడ్డులో ఒకటి, మండలంలోని అప్పాజిపేట గ్రామంలో మరొకటి ఇలా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు దుండగులు ధ్వంసం చేశారు. ఆయా ట్రాన్స్‌ఫార్మర్లు కింద విద్యుత్ సరఫరా కాక పంటపొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై సీఐ రాజశేఖర్‌రెడ్డిని అడగ్గా.. ఈ ఘటనలపై ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

సామాజిక తనిఖీలో అంతా గోప్యం

● బహిరంగ వేదికలో వివరాలను వెల్లడించని అధికారులు

బొమ్మనహాళ్, ఆగస్టు7: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధిహామీ పథకం పనులలో అక్రమాలు బయటకు రాకుండా సామాజిక తనిఖీ బృందం గోప్యంగా ఉంచేసినట్లు తెలుస్తోంది. గత జూలై 26 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు మండలంలో సామాజిక తనిఖీ బృందం సోషల్ ఆడిట్‌ను నిర్వహించారు. మండలంలో 11 నెలల పాటు రూ. 8.14 కోట్ల వ్యయంతో 904 పనులు జరిగాయి. ఈ పనులపై తనిఖీ అధికారులు పదిరోజుల పాటు ఆడిట్ చేశారు. ఈ వివరాలను వెల్లడించేందుకు బుధవారం మండలకేంద్రంలో సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో డ్వామా ప్రొసిడింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి, డీ వీఓ ఫర్వేజ్ పాల్గొని కార్యక్రమాన్ని మమ అనిపించారు. ఎంత రికవరీ అయిందన్న వివరాలను వెల్లడించకుండా గోప్యత పాటించి వెళ్లిపోయారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు కొందరు ఫీల్డు అసిస్టెంట్లు ఏర్పాటు చేసిన విందులకు అలవాటు పడి గ్రామాలలో పనులపై సరిగా విచారణ చేయలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

గుత్తి, ఆగస్టు 7: తమ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరుతూ బేతాపల్లిలోని వంకాయ కాలనీ ప్రజలు పట్టణంలోని ఏడీఏ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. తమ కాలనీలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, దీంతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని వాపోయారు. గత రెండేళ్లుగా సమస్య నెలకొందన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం చెందారు. ఇప్పటికైనా స్పందించి తమ కాలనీకి విద్యుత్ అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఈ మేరకు ఏడీఈ సాయిశంకర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

యల్లనూరు, ఆగస్టు7: మండలంలోని దుగ్గుపల్లి గ్రామంలో బుధవారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. విగ్రహప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా చివరిరోజున అర్చకులు వేదమంత్రాల మధ్య స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి